ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం BHADRADRI KOTHAGUDEM
శనివారం, 18 జనవరి 2025 5





ముదిగొండలో కొత్త కాకతీయుల కాలంనాటి శాసనం లభ్యం

1216లో గాంగణ వంశీకులు వేయించినట్లు గుర్తింపు

ముదిగొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ముదిగొండలో కొత్త కాకతీయులకాలం నాటి గాంగణ వంశీకుల శాసనం లభించినట్లు తెలంగాణ చరిత్ర బృందం కో-కన్వీనర్, చరిత్ర పరిశోధకుడు కట్టా శ్రీనివాస్ తెలిపారు. ముదిగొండ మండల కేంద్రంలో ఇటీవల బుద్ధ నిర్వాణ శిల్పం, బ్రాహ్మీశాసన శకలం లభించాయని తెలిపారు. ఆ శాసనంపై ఉన్న వివరాల ప్రకారం అది 1216 విజయనామ సంవత్సరం మాఘ శుద్ధదశమి అనగా క్రీస్తుశకం 1294 జనవరి 8 శుక్రవారం రోజు కాకతీయ పాలకుడు ప్రతాపరుద్రుని కాలంలో వేయబడిందని ఆయన తెలిపారు. ఈ శాసనాన్ని తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ విశదీకరించారు. ఈ శాసన స్తంభం ఒకటి భూమిలో కూరుకుపోవడంతో పూర్తి శాసనపటం లభించలేదని, ఈ శాసనాన్ని బయటకు తీసి అధ్యయనం చేస్తే ఖమ్మం జిల్లా శాసనాలకొక కొత్త పేజీ లభిస్తుందని వారు తెలిపారు. తెలంగాణ చరిత్ర బృందం క్షేత్ర పరిశోధనలో పసుమర్తి శ్రీనివాస్, పూజారి యజ్ఞేశ్, లక్ష్మీ సహకరించినట్లు వారు తెలిపారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం అమలు చేయబోతున్న 'రైతుభరోసా' పథకానికి సంబంధించిన క్షేత్రస్థాయి సర్వే జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. సాగుకు పనికిరాని భూములను గుర్తించేందుకు గ్రామస్థాయిలో చేపట్టిన ఈ సర్వేలో అర్హుల జాబితా పక్కాగా తేలుతోంది. అనేక చోట్ల సాగుకు పనికారి భూములు బయటపడుతున్నాయి.



తేలుతున్న 'పెట్టుబడి' లెక్క!

జిల్లాలో ముమ్మరంగా 'రైతుభరోసా' సర్వే

- ప్రతి గ్రామంలోనూ బయటపడుతున్న అనర్హులు
- గతంలో ప్లాట్లు, కొండలు, గుట్టలకు 'రైతుబంధు'
- ప్రతి గ్రామంలో 5 నుంచి 10 శాతం అనర్హమైనవే..

ఖమ్మం, జనవరి 17(ఆంధ్రజ్యోతిప్రతినిధి): గతంలో రైతుబంధు' పథకంలో భూములు తమ ఆధీనంలో లేకపోయినా, సాగుకు పనికిరాకపోయినా అనేకమంది పెట్టుబడిసాయం పొందారు. గత ప్రభుత్వ హయాంలో క్షేత్రస్థాయిలో పరిశీలన లేకుండా 'ధరణి' పట్టాదారు పాసుపుస్తకాలను పరిగణలోకి తీసుకుని నేరుగా రైతుల ఖాతాలకు ప్రభుత్వ సొమ్ము జమచేశారు. దీంతో ప్రతి గ్రామంలోనూ భూసేకరణ కింద, రోడ్లు, భవనాలు, సాగునీటి కాలువల కింద సేకరించిన భూములకు కూడా రైతుబంధు ఇచ్చారు. ఈ పరిస్థితిని మార్చి ప్రస్తుతం ప్రభుత్వం సాగుభూములకు మాత్రమే రైతుభరోసా' ఇచ్చేందుకు క్షేత్రస్థాయి సర్వే చేపట్టింది. గత రెండురోజులుగా జరుగుతున్న సర్వేలో ప్రతి గ్రామంలోనూ అనేక వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. భూములు ఆధీనంలో లేకపోయినా రైతుబంధు పొందుతున్న రైతుల జాబితా సర్వేలో బయటపడుతోంది. ప్రతి గ్రామం నుంచి 20నుంచి 25ఎకరాలకు భూమి లేకపోయినా రైతుబంధు' నిధులు జమ చేసినట్లు తేలుతోంది. మండల కేంద్రాల్లోనూ భూమిలేకపోయినా సాగుసాయం పొందినట్లు సర్వేలో బయటపడుతోంది.

ప్రతి గ్రామంలో 5 నుంచి 10 శాతం అనర్హమైనవే..

జిల్లాలో ప్రతి గ్రామంలో 5నుంచి 10శాతం వరకు రికార్డుల్లో ఉండి వాస్తవంగా లేని భూములు, సాగుకు పనికిరాని భూములు ఉన్నట్లు తేలుతోందని సర్వేలో పాల్గొంటున్న ఆర్ఐలు, ఏఈవోలు, మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తల్లాడ మండలం మల్లారం గ్రామంలో గతంలో 2,585 ఎకరాలకు 'రైతుబంధు' సహాయం అందించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో 28 ఎకరాల రియల్ఎస్టేట్ వెంచర్ భూములున్నట్లు గుర్తించారు. కొణిజర్ల మండలం తనికెళ్లలో గతంలో 2,912 ఎకరాల్లో రైతుబంధు సాయం అందింది. ఇప్పుడు సర్వేలో 20 ఎకరాలు వెంచర్ల భూములున్నట్లు గుర్తించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సర్వారం గ్రామంలో గతంలో 1,089 ఎకరాలకు రైతుబంధు' అందగా 'రైతుభరోసా' సర్వేలో 27 ఎకరాలు ప్లాట్లుగా మారినట్లు గుర్తించారు. బోనకల్ మండల కేంద్రంలో గతంలో 1,547 ఎకరాలకు 'రైతుబంధు' అందేది. సర్వేలో 18 ఎకరాలు రియల్ ఎస్టేట్‌కు మారింది. ఇలా చిన్న గ్రామాల్లో 10నుంచి 15ఎకరాలు, పెద్దగ్రామాల్లో 15నుంచి 30ఎకరాలకు పైగా రియల్ వెంచర్లుగా మారినట్లు సర్వేలో తేలుతోంది. మండల కేంద్ర సమీప గ్రామాల్లో ఈ లెక్క పెరిగే అవకాశం ఉంది. ఖమ్మం జిల్లా పరిధిలో 3,42,803 మంది రైతులు, 7,40,615 ఎకరాల భూములకు 'రైతుబంధు' అందుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,85,014మంది రైతులు, 5,09,966.82 ఎకరాలకు 'రైతుబంధు' సాయం అందుకున్నారు. 'రైతుభరోసా' సర్వేలో ఈ భూముల వీస్తీర్ణం కొంత తగ్గే అవకాశం ఉంది.



ఓపెన్‌టాప్ జీపులో అటవీ పార్కును సందర్శిస్తున్న మంత్రి తుమ్మల

పట్టణ అటవీ పార్కులకు ప్రాధాన్యం

- టూరిస్ట్ స్పాట్‌గా వెలుగుమట్ల అటవీ పార్కు
- పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పట్టణ అటవీపార్కులకు ప్రాధాన్యమిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ అటవీ పార్కును టూరిస్టు స్పాట్‌గా తీర్చిదిద్దుతామన్నారు. పార్క్ అభివృద్ధిలో అధికారులు భాగస్వామ్యం కావాలని సూచించారు. వెలుగుమట్ల అర్బన్ అటవీపార్కును శుక్రవారం మంత్రి తుమ్మల సందర్శించారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తదితరులతో కలిసి పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రంసింగ్ పార్కు అభివృద్ధికి చేపడుతున్న పనులు వివరించారు. ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఓపెన్‌టాప్ జీపులో పార్కు మొత్తం కలియ తిరిగారు. క్లాక్ టవర్ ఎక్కి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం అటవీపార్కు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు వివరించారు. రాష్ట్రంలోనే ప్రముఖ అటవీపార్కుల్లో ఒకటిగా ఖమ్మం అటవీపార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అటవీపార్కులో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వెలుగుమట్ల, కొత్తగూడెం, సత్తుపల్లి అటవీపార్కుల అభివృద్ధికి రూ.3కోట్లు మంజూరు చేసిందన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో అన్ని (మిగతా 6వ పేజీలో)

భద్రాచలం రివర్ సైడ్ క్యాంపునకు ప్యాకేజీ ఖరారు

- ఒక రోజుకు పూర్తి ప్యాకేజీ రూ.750
- విడిదికి రూ.500 మాత్రమే

7



బీఆర్ఎస్ కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ

ప్రతిపక్షంగా ప్రజాసమస్యలపై పోరాడాలి

- బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశంలో మాజీ మంత్రి అజయ్
- బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఎన్నిక

ఖమ్మంటౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులుగా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశాల్లో బలమైన ప్రతిపక్షపాత్ర పోషించి, ప్రజాసమస్యలపై పోరాడాలని మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని మమత ప్రాంగణంలోని తన నివాసంలో శుక్రవారం బీఆర్ఎస్ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎటువంటి కార్యక్రమం నిర్వహించినా.. పార్టీశ్రేణులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. అధికారం లేదని అధైర్యపడవద్దని, తాను ఎల్లప్పుడూ పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా తన వద్దకు రావాలని కేడర్‌కు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయటంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యలను సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కారానికి పోరాడాలన్నారు.

ఫ్లోర్‌లీడర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌ల ఎన్నిక

బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌ను ఈ సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫ్లోర్‌లీడర్‌గా 41వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని మాజీ మంత్రి సత్కరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ, సుడా మాజీ ఛైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

భద్రాద్రిలో వేడుకగా దొంగలదోపు

- కల్కి అవతారంలో రామయ్య దర్శనం
- విశ్రాంత మండపంలో రామయ్యకు రాపత్తుసేవ



దొంగలదోపు ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పరకాలుడిని పట్టుకున్న రక్షక భటులు

భద్రాచలం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం భద్రాద్రి రామయ్య కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. కాగా రాత్రి తాతగుడి సెంటర్‌లో దొంగల దోపు ఉత్సవం వేడుకగా నిర్వహించారు. తిరుమంగై ఆళ్వార్ చరిత్రకు సంబంధించిన ఈ ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో భాగంగా పరకాలుడు వేషధారి శంఖు, చక్రాలు, గొడుగు చోరీ చేయగా వాటిని భటులు స్వాధీనం చేసుకొని స్వామివారి ముందు నిందితుడిని ప్రవేశపెడతారు. ఈ సమయంలో నిందితుడు తన తప్పు ఒప్పుకొని స్వామివారిని క్షమించమని కోరతాడు. ఈ సందర్భంగా పెరయ తిరుముడిలోని తొలి పది పాశురాలను అనుసంధానం చేసి పరకాలుడు వేషధారుడికి, భటులకు సన్మానం చేశారు.

విశ్రాంత మండపంలో రామయ్యకు రాపత్తుసేవ

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాపత్తుసేవల్లో భాగంగా శుక్రవారం శ్రీ సీతారామచంద్రస్వామికి రాజవీధిలోని విశ్రాంత మండపంలో రాపత్తుసేవ నిర్వహించారు. రామాలయం నుంచి స్వామి వారిని పలివెల నారాయణరావు కుటుంబ సభ్యులు మేళతాళాలతో మండపం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం స్వామివారికి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఉపప్రధాన అర్చకులు అమరవాది గోపాలాచార్యులు, విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి రామచంద్రాచార్యులు, సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు, పలివెల సాంబశివరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. భద్రాచల శ్రీసీతా రామచంద్రస్వామిని శుక్రవారం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, జీయర్‌మఠం నిర్వాహకులు గట్టు వెంకటాచార్య పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లపై బ్యాంకర్లతో సీపీ సమీక్ష

ఖమ్మంక్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో బ్యాంకర్లు నగదు రవాణా చేస్తున్న సమయంలో తీసుకుంటున్న భద్రతా ఏర్పాట్లపై ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం బ్యాంకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల కర్ణాటకలోని బీదర్‌లో ఏటీఎం నగదు ఉన్న వాహనంపై దుండగులు జరిపిన కాల్పులు ఘటన నేపథ్యంలో ఇక్కడ తీసుకుంటున్న జాగ్రత్తలపై సీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అన్ని బ్యాంకుల వద్ద రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఏదైనా బ్యాంకులో భారీ లావాదేవీలు జరిగినప్పుడు సంబంధిత బ్యాంకు అధికారి అభ్యర్థిస్తే ఎలాంటి ఆలస్యం లేకుండా స్థానిక పోలీసులు



సాయం అందిస్తారని సీపీ తెలిపారు. ముఖ్యంగా బ్యాంకు పేరుతో భద్రతా ప్రయోజనం కోసం తుపాకీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బ్యాంకు అధికారులకు సూచించారు. సమావేశంలో ఏడీసీపీ ప్రసాద్‌రావు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌తోనే సరిపెడతారా?

- వైరా అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో అరకొర చర్యలు
- కంటితుడుపుగానే సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్!
- సస్పెన్షన్ జీవోలో పేర్కొన్న కారణాలపై విమర్శలు
- మరుగునపడ్డ అసలు అక్రమాలు
- 'మార్ట్‌గేజ్'లో ఉన్న 27 విల్లాలకు ఖాళీ స్థలాలుగా రిజిస్ట్రేషన్లు
- లోతైన విచారణతోనే అక్రమాల గుట్టు బయటికి..

వైరా, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే రోజు రూ.వందల కోట్ల విలువైన స్థలాల అక్రమ రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి నిజాలను నిగ్గు తేలుస్తుందా? లేక సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్‌తోనే సరిపెడుతుందా? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతేడాది డిసెంబరు 28వ తేదీన అర్ధరాత్రి వరకు ఒకేరోజు కొణిజర్ల మండలంలోని ఒక వెంచర్‌లోని సుమారు 500 ప్లాట్లకు చెందిన 1,44,952.97గజాల స్థలాలను రిజిస్ట్రేషన్లు చేశారు. వీటిలో అప్రూవ్డ్ లేఅవుట్ ఉన్న 99,475.02గజాలను 60 డాక్యుమెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. కానీ కేవలం 4 డాక్యుమెంట్ల ద్వారా అనుమతిలేని లేఅవుట్‌కు చెందిన 45,477.95గజాలకు అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. వాస్తవంగా ఇవి ప్లాట్లు కాగా అందుకు భిన్నంగా గజాలుగా రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా ఎల్ఆర్ఎస్ రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి కొట్టారనే ఆరోపణలు ఉన్నాయి. 28వ తేదీ ఒక్కరోజే ఇక్కడ (మిగతా 6వ పేజీలో)



జీవో 317 బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- స్పౌజ్, పరస్పర, అనారోగ్య సమస్యలున్న వారికి అవకాశం
- భద్రాద్రి జిల్లా నుంచి 40మంది ఉపాధ్యాయుల దరఖాస్తు

కొత్తగూడెం అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవో-317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులు తమ సొంత జిల్లాలకు వెళ్లేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దాంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40మంది టీచర్లు బదిలీకోసం దరఖాస్తు చేసుకున్నారు. శనివారం డీఈవో కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన చేయనున్నారు. భార్యాభర్తలు, మ్యూచువల్, అనారోగ్య సమస్యల కేటగిరీలో ఉపాధ్యాయుల బదిలీలకు మోక్షం లభించింది. 2021 డిసెంబరు 6న సీనియారిటీ ఆధారంగా ఉపాధ్యాయులను జిల్లాలకు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం జీవో-317ను జారీ చేసింది. కాగా స్థానికత ఆధారంగా జిల్లాలు కేటాయించాలని ఉపాధ్యాయులు అప్పటినుంచి డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ జీవో-317 ద్వారా నష్టపోయిన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. ఏడాది పాలన పూర్తయిన తర్వాత ఈ బదిలీలకు పచ్చజెండా ఊపింది. ప్రభుత్వం స్థానికసంస్థలు రాష్ట్రప్రభుత్వ సంస్థల్లో (మిగతా 6వ పేజీలో)

అనారోగ్యంతో వ్యక్తిమృతి

- సింగరేణి కాలుష్యమే కారణమని స్థానికుల ఆరోపణ
- కిష్టారం అంబేద్కర్‌నగర్ వద్ద మృతదేహంతో బైఠాయింపు

6



పేరెల్లి కోటికి ఉస్మానియా వర్శిటీ డాక్టరేట్



ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో నగరంలోని కేయూ వర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడిగా పనిచేస్తున్న పేరెల్లి కోటికి శుక్రవారం ఉస్మానియా వర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం చెన్నకేశాపూర్ గ్రామానికి చెందిన ఆయన వ్యాయామ విద్యలో హిస్టారికల్ డెవలప్‌మెంట్ ఆఫ్ కబడ్డీ ఇన్ ఇండియా విత్ ఏ స్పెషల్ రిఫరెన్స్ టు తెలంగాణ స్టేట్ అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా డాక్టరేట్ పట్టా అందుకున్న కోటిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు వెంకట్, శ్రీనివాస్ పలువురు అధ్యాపకులు అభినందించారు.



అరుదైన ఉత్సవం... విశ్వరూప సేవ

26న భద్రాద్రి రామయ్య సన్నిధిలో నిర్వహణ

భద్రాచలం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామక్షేత్రంలో తప్ప మరే క్షేత్రంలో జరగని అరుదైన ఉత్సవం విశ్వరూప సేవ. ఈ సమయంలో భద్రాద్రి రామాలయంలో ఉన్న అన్ని రకాల ఉత్సవ విగ్రహాలను ఒక చోట అలంకరించి ఏకారాధన చేసే విశేషోత్సవం ఇది. ఇది వైకుంఠ ఏకాదశి వైభవాన్ని తలపించేలా ఈ ఉత్సవం ప్రభుతోత్సవం తరువాత నిర్వహిస్తారు. భద్రాద్రి రామాలయంలో ఈనెల 26న విశ్వరూపసేవ (సకల దేవతా అలంకారం) నిర్వహించనున్నారు. వైకుంఠ ఏకాదశి (ముక్కోటి)ఈ నెల 10న రాగా సరిగ్గా 16వ రోజున ద్వాదశి నాడు (జనవరి 26న) భద్రాద్రి రాముని సన్నిధిలో విశ్వరూప సేవ అనే ఉత్సవాన్ని నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశి తరువాత వచ్చే బహుళ ద్వాదశి ఘడియల్లో ఉత్సవమూర్తులన్నింటిని ఒకేచోట చేర్చి ఆరాధాన నిర్వహించడం భద్రాద్రి దేవస్థానంలో ప్రత్యేకత. రామాలయంలోని నిత్యకల్యాణ మండపవేదిక వద్ద ఇందుకోసం ప్రత్యేక అలంకరణలు, డిజైన్లతో ఏర్పాట్లు చేపట్టనున్నారు. కాగా విశ్వరూప సేవ సమయంలో స్వామివారికి సమర్పించే (ప్రత్యేక ప్రసాదం) కదంబానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది.

నేటినుంచి కుసుమ హరనాథ ఆనంద మేళోత్సవాలు

ఇల్లెందు జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కుసుమ హరనాథ 80వ ఆనంద మేళా ఉత్సవాలకు నిర్వాహకులు ఇల్లెందు పట్టణంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. శనివారం నుంచి మూడురోజులపాటు జరగనున్న ఈ ఉత్సవాలు పట్టణంలోని పటేల్ చౌక్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్టు శ్రీకుసుమ హరనాథ సేవా సమితి అధ్యక్షుడు స్వరాజ్య గుప్త కోశాధికారి హరనాథ, కార్యదర్శి పుల్లూరు జ్యోతి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజులపాటు జరగనున్న వేడుకలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తారని వెల్లడించారు. శ్రీకుసుమ హరనాథల విశ్వప్రేమ సందేశాలను దేశవ్యాప్తంగా గత 79ఏళ్లుగా ప్రచారం చేస్తూ మానవ సేవే మాధవసేవగా ప్రచార కార్యక్రమం జరుపుతున్నట్టు తెలిపారు. సామూహిక కుంకుమార్చన, లీలాకల్యాణ వేడుకలు, రక్త దానం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7 నుంచి 9వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. టి.సత్యసాయి, సీహెచ్.యశ్వంత్‌లు ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ సబ్‌థీమ్ విభాగంలో స్మార్ట్‌కార్, స్మార్ట్ కమ్యూనికేషన్ టైటిల్‌తో ప్రదర్శించిన ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులను, ప్రాజెక్టు గైడ్ టీచరు కే.రోషయ్యలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం కలెక్టరేట్‌లో అభినందించారు. ఈనెల 21 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో జరగనున్న సౌత్ ఇండియా స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులను, పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ రాజారెడ్డికి కలెక్టర్, డీఈవో సోమశేఖరశర్మ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఖమ్మం జిల్లానుంచి ఉత్తమ ప్రాజెక్టులను జాతీయస్థాయిలో అందించాలని ఆకాంక్షించారు. ప్లాస్టిక్ నిర్మూలించడానికి భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు.

గిరిజన రైతుల అకౌంట్లన్నింటిని ఆధార్‌తో అనుసంధానించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

భద్రాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులందరికీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతు భరోసా నిధులు వారి ఖాతాల్లో వేయాలంటే తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం అవసరం ఉన్నందున గిరిజన రైతులందరికీ ఆధార్ అనుసంధానం అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ అన్నారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఐటీడీఏ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రత్యేక అధికారులతో గిరిజన రైతుల ఆధార్ అనుసంధానం పెండింగ్‌ల ఉన్న ప్రగతిపై ఆయన సమీక్షించారు. గిరిజన రైతులకు ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారులు వెంటనే జిల్లా కలెక్టరు, పీవో దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. గిరిజన రైతులకు సంబంధించి ఆధార్ జనరేట్ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. అలాగే ఆధార్ అనుసంధానమైన ప్రతిపాదనలు వెంటనే జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంకు పంపాలని, ఏ ఒక్క గిరిజన రైతులను వదలకుండా ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయించాలన్నారు. గిరిజన గ్రామాల్లో గిరిజన రైతులకు సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న గ్రామాల్లో సోలార్ విద్యుత్తు ప్లాంటు ఏర్పాటు కోసం ఏజెన్సీ గ్రామాల్లోని గిరిజన రైతులతో పాటు ఇతర గిరిజన రైతులను కూడా గుర్తించి సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.



బోటింగ్‌కు సిద్ధం చేస్తున్న చెరువును పరిశీలిస్తున్న పీవో

మ్యూజియం అభివృద్ధి పనులను పరిశీలించిన పీవో

గిరిజన మ్యూజియం అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని ఆయన సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలు ఆడుకునే విధంగా క్రీడా పరికరాలు, మ్యూజియంలో అమర్చిన సోలార్ విద్యుత్తు లైట్ల ఏర్పాట్లు చాలావరకు పూర్తి చేయడం జరిగిందని, అలాగే పర్యాటకులు బోటింగ్ చేయడం కోసం ఏర్పాటు చేసిన కుంటను పూర్తిగా శుభ్రం చేయించాలని, స్టాల్స్ ఏర్పాట్లు, గిరిజన వంటకాల తయారు చేసే ప్రదేశాలు, చుట్టు పక్కల ఉన్న చెత్తను తొలగించాలని పంచాయతీ ఈవో శ్రీనివాస్‌ను పీవో ఆదేశించారు.

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా గుంటుపల్లి

ఏకగ్రీవంగా జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ నూతన కార్యవర్గం

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్షుడిగా గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కొణిదెన శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఖమ్మం జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.సతీష్ వ్యవహరించారు. పర్యవేక్షకులుగా టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, జిల్లా టీఎన్జీవో అడహక్ కమిటీ కన్వీనర్ ముత్యాల సత్యనారాయణ గౌడ్ పర్యవేక్షించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శితో పాటు నూతన కార్యవర్గానికి సింగిల్ సెట్ నామినేషన్లు రావడంతో కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ప్రకటించారు. అనంతరం జిల్లా యూనియన్ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీజేఏస్ చైర్మన్ మారం జగదీశ్వర్, కార్యదర్శులు ఎస్ఎం.హుస్సేన్ ముజీబ్ తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఉద్యోగుల సమస్యలపై పూర్తిస్థాయిలో ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ నాయకత్వం పనిచేసి సమస్యల పరిష్కారంలో జిల్లా నాయకత్వం కృషి చేయాలని కోరారు. టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కొణిదెన శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా కొమరగిరి దుర్గాప్రసాద్, కోశాధికారిగా వల్లపు వెంకన్న, ఉపాధ్యక్షులుగా ఎర్రా రమేష్, బానోత్ శ్రీధర్ సింగ్, సగ్గుర్తి ప్రకాష్‌రావు బదావత్ కరణ్‌సింగ్, ఎస్.లలిత కుమారి, సహాయ కార్యదర్శులుగా తాళ్లూరి శ్రీకాంత్, భూసా చంద్రశేఖర్, యాకూబ్ పాషా, ఏలూరి హరికృష్ణ, శీలం రాధికారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెద్దినేని రాధాకృష్ణ, పబ్లిసిటీ సెక్రటరీగా ఎర్రమల్ల శ్రీనివాసరావు ఆఫీస్ సెక్రటరీగా టి.రవీంద్రబాబు, స్పోర్ట్స్ సెక్రటరీగా సాయికృష్ణ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎండీ అస్లాం, ఎన్.విజయ, డి.నాగరాజు, ఇ.రవిచంద్ర, రహీమ్ ఖాన్, వాసాల శ్రీను, బి.నాగలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా నాయకులు పొట్టపింజర రామయ్య, గంగవరపు బాలకృష్ణ, జడ్.ఎస్.జైపాల్ విజయ్ కుమార్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి, కార్యదర్శి ఎండి ఫస్యుద్దీన్ (ముక్రమ్) అభినందించారు. ఖమ్మం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రమణ యాదవ్, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు, టీజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ మోదుగు వేలాద్రి పీఆర్‌టీయూ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులడు యలమద్ది వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు నాగిరెడ్డి, ఎస్.విజయ్ ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు తదితరులు అభినందించారు. అనంతరం ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.



గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షుడు



కొణిదెన శ్రీనివాస్ సెక్రటరీ

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

నూతన అధ్యక్షుడు గుంటుపల్లి

జిల్లాలో ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీష్ ద్వారా ఉద్యోగుల సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. జిల్లాలో ఏ ఉద్యోగికి సమస్య వచ్చినా పరిష్కారానికి ముందుంటామని ఆయన తెలిపారు.

కొత్తగూడేన్ని కార్పొరేషన్ చేయొద్దు

గవర్నర్‌కు భద్రాద్రి జిల్లా గిరిజన సంఘాల జేఏసీ నాయకుల వినతి

కొత్తగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడేన్ని కార్పొరేషన్ చేయొద్దని, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గిరిజన సంఘాల జేఏసీ భద్రాద్రి జిల్లా నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ మండలాల్లోని ఏజెన్సీ ప్రాంతాలను కలుపుతూ కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కేయూడీఏ) కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం సరి కాదని గవర్నర్‌కు తెలిపారు. ఈ కార్పొరేషన్ ఏర్పాటుతో గిరిజనుల హక్కులు, చట్టాలకు తీవ్ర విఘాతం వాటిల్లుతుందని, గిరిజన, ఆదివాసీ షెడ్యూల్ ప్రాంతాలను కలుపుకొని కార్పొరేషన్ ఏర్పాటు చేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. 74వ రాజ్యాంగ సవరణ ఆర్టికల్ 243 జెడ్‌సీ ప్రకారం ప్రకరణ 244(1) 244 (2) ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలకు కార్పొరేషన్ ఏర్పాటు వర్తింపులో మినహాయింపు ఉందని స్పష్టంగా చట్టం చెప్తున్నాయని పేర్కొన్నారు. గిరిజన చట్టాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసి గిరిజన హక్కులను కాపాడాలని గవర్నర్‌నుకోరారు. గవర్నర్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు, సేవాలాల్ సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్‌నాయక్, రాష్ట్ర కోకన్వీనర్ బాణోత్ హుస్సేన్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, ఆదివాసీ హక్కుల పోరాటసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు భిక్షం, టీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాములునాయక్, నాయకులు పాల్గొన్నారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సస్పెన్షన్‌తోనే సరిపెడతారా?

(5వ పేజీ తరువాయి)

89రిజిస్ట్రేషన్లు కాగా వాటిలో కొణిజర్ల మండలంలోని ఒకే వెంచర్‌కు చెందిన 64రిజిస్ట్రేషన్లు ఉండటం గమనార్హం.. వాటిలో పైన పేర్కొన్నట్లు 60డాక్యుమెంట్లలోని ప్లాట్లు లేఅవుట్‌తో ఉండగా నాలుగు డాక్యుమెంట్లలోని స్థలాలకు లేఅవుట్ అనుమతులు లేవు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆ వెంచర్‌లోని ఒక భాగస్వామి చేసిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

27విల్లాలకు ఖాళీస్థలాలుగా డబుల్ రిజిస్ట్రేషన్లు..

ఇదిలా ఉండగా ఈ వెంచర్‌లో పలువురు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని విల్లాలు నిర్మించుకున్నారు. కొన్ని విల్లాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. అయితే వీటిలో 27విల్లాలను ఖాళీస్థలాలుగా పేర్కొంటూ 28వ తేదీ రాత్రి రిజిస్ట్రేషన్లు చేయించిన వ్యవహారం కూడా ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఈ 27 విల్లాల్లో కొన్ని నిర్మాణాలు పూర్తయి సంబంధిత లబ్ధిదారులు వినియోగించుకుంటున్నారు. కొన్ని విల్లాలు నిర్మాణదశలో ఉన్నాయి. ఈ 27విల్లాలకు బ్యాంకులు రుణాలిచ్చాయి. ఆ విల్లాలను బ్యాంకులు మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నాయి. వైరా రిజిస్ట్రార్ కార్యాలయంలోనే ఆ మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లు ఉన్నా కనీసం ఆ విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకోకుండా ఖాళీ స్థలాలుగా రిజిస్ట్రేషన్లు చేసి తమ ఘనతను చాటుకున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు కారణాలివా..?

వైరా సబ్‌రిజిస్ట్రార్ బి.రామచంద్రయ్య సస్పెన్షన్‌కు పేర్కొన్న కారణాలు అతి పేలవంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం ఐదు ప్లాట్లకు సంబంధించి డబుల్ రిజిస్ట్రేషన్ చేయటం, అర్ధరాత్రి వరకు రిజిస్ట్రేషన్లు చేసిన కారణాలతోనే రామచంద్రయ్యను సస్పెండ్ చేసినట్లు చెప్పడం ఏంటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లా రిజిస్ట్రార్, వరంగల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన నివేదిక మేరకు రాష్ట్ర రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపు కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ జ్యోతి బుద్ధప్రకాష్ సస్పెన్షన్ ఉత్తర్వులిచ్చారు. గ్రీన్‌ల్యాండ్ డెవలపర్స్‌లోని ప్లాట్‌నెంబర్ 6, 8, 108, 134, 135కు డబుల్ రిజిస్ట్రేషన్ చేయటాన్ని, అర్ధరాత్రి వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగించడాన్ని సస్పెన్షన్‌కు కారణాలుగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఈ డబుల్ రిజిస్ట్రేషన్‌గా ఉన్న ఐదు ప్లాట్లు కూడా ఖాళీస్థలాలుగా లేవని సమాచారం. వాటిలో విల్లాలు ఉన్నాయి. అయితే ఆ విషయాన్ని మరుగుపరిచి ఖాళీస్థలాలుగా రిజిస్ట్రేషన్ చేయించారు. వీటికితోడు మరో 22విల్లాలకు కూడా ఖాళీస్థలాలుగా రిజిస్ట్రేషన్లు చేయించినట్లు ఫిర్యాదులందాయి. వీటిపై అధికారులు దృష్టిసారించలేదనే విమర్శలున్నాయి.

అక్రమ రిజిస్ట్రేషన్లపై ప్రస్తావనేదీ...

సబ్‌రిజిస్ట్రార్ రామచంద్రయ్య సస్పెన్షన్ ఉత్తర్వుల్లో ఎక్కడ కూడా అనుమతులు లేని ప్లాట్లకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసిన విషయాన్ని ప్రస్తావించలేదు. ఎల్ఆర్ఎస్ రూపంలో వచ్చే రూ.కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయినా ఆ అంశాన్ని అధికారులు పేర్కొనలేదు. అలాగే నిర్మించిన, నిర్మాణ దశలో ఉన్న 27విల్లాలకు సంబంధించి బ్యాంకులకు మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లు ఉన్నా వాటికి ఖాళీ స్థలాల కింద రిజిస్ట్రేషన్ చేయటాన్ని కూడా అధికారులు పరిగణలోకి తీసుకోలేదని సస్పెన్షన్ ఉత్తర్వుల ద్వారా తేట తెల్లమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్‌తోనే సమస్యకు ముగింపు పలుకుతారా.. లేక సమగ్ర దర్యాప్తు చేసి ప్రభుత్వం కోల్పోయిన ఆదాయాన్ని రాబట్టడంతోపాటు అక్రమ రిజిస్ట్రేషన్లకు బాధ్యులైన సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటారా అనే అంశంపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పట్టణ అటవీ పార్కులకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

అటవీపార్కుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. వెలుగుమట్ల అటవీపార్కులో రోజుకు 10వేలమంది పర్యాటకులు, సందర్శకులు వచ్చేలా అభివృద్ధి చేయాలని, సహజసిద్ధమైన అటవీమొక్కలు, అటవీపూలు, అటవీపండ్ల మొక్కలు నాటాలని సూచించారు. ఖమ్మం మీదుగా వెళ్లే ప్రతి ఒక్కరు ఈ పార్కును సందర్శించేలా అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే పిల్లలు, పెద్దలకు ప్రకృతి, పర్యావరణం పట్ల అవగాహన పెంచుకునేందుకు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పార్కులో రోడ్లతో పాటు చిరుధాన్యాల వంటకాలతో క్యాటింగ్ ఏర్పాటుచేయాలని, ప్లాస్టిక్‌రహితంగా ఈ పార్కును తీర్చిదిద్దాలని ఆదేశించారు. పట్టణాల్లో భవిష్యత్తులో ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, పట్టణాల సమీపంలో అటవీపార్కులు అభివృద్ధి చెందితే సమీప ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అర్బన్ పార్కులో జింకలపార్కు ఏర్పాటు చేస్తున్నామని, పలురకాల జంతువులు, పక్షులు ఈ పార్కులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకుంటూ అభివృద్ధిని సాధించాలన్నారు. అప్పుడే అది శాశ్వతంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అటవీపార్కును సందర్శింపచేస్తున్నామని, తద్వారా అడవులు, పర్యావరణం పట్ల వారిలో అవగాహన కలుగుతుందన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రంసింగ్ మాట్లాడుతూ 1977లో 546ఎకరాల్లో అర్బన్‌పార్కుకు నోటిఫికేషన్ చేశామని, 2015లో 250ఎకరాలను ఆక్రమణదారుల నుంచి తీసుకుని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ పార్క్ అభివృద్ధికి ఆనాడు మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు తీసుకున్న చర్యల వల్లే ఇంత ఇంత అభివృద్ధి చెందుతోందన్నారు. టీయూఎఫ్‌డీసీ నుంచి రూ.3కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ప్రతి రోజు సందర్శకులు వస్తున్నారని, సందర్శకుల సంఖ్య మరింతగా పెంచుతామన్నారు.

వెహికల్ పార్కింగ్ కోసం సోలార్‌ప్యానల్ షెడ్ ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ట్రైనీ ఐపీఎస్ రుత్విక్‌సాయి, డీఆర్‌డీవో సన్యాసయ్య, ఆర్డీవో నర్సింహరావు, కార్పొరేటర్లు కమర్తపుమురళి, రావూరి కరుణ, ఖమ్మం మార్కెట్ చైర్మన్‌గా నియమితులైన యరగర్ల హనుమంతరావు, వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, సాధురమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిత్రాలను వీక్షిస్తున్న మంత్రి తుమ్మల

రాయలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నేలకొండపల్లి, జనవరి17 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనను ముగించుకుని స్వదేశానికి వచ్చిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావును మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అంజని, నాయకులు సోమనబోయిన సాయినవీన్, వెంకటేశ్వర్లు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

- సింగరేణి కాలుష్యమే కారణమని స్థానికుల ఆరోపణ
- కిష్టారం అంబేద్కర్‌నగర్ వద్ద మృతదేహంతో బైఠాయింపు

సత్తుపల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన లారీ క్లీనర్ బుర్రా తుకారం(రవీంద్ర)(37) కొద్ది నెలలుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. అయితే గ్రామంలో బొగ్గు లోడింగ్ చేసే సైలోబంకర్ కారణంగానే తుకారం మృతిచెందాడని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు రాష్ట్రీయ రహదారిపై మృతదేహంతో బైఠాయించి ఆందోళన చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, ఎంతమంది ప్రాణాలు తీసుకుంటారని, పునరావాసం కల్పించాలంటూ నినాదాలు చేశారు. దాంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.



కిష్టారంలో ఆందోళన చేస్తున్న బంధువులు

సెల్ఫీ వీడియో వైరల్..

కిష్టారంలోని సింగరేణికి చెందిన సైలోబంకర్ ద్వారా బొగ్గు లోడింగ్ చేసే సమయంలో వచ్చే బొగ్గు మసి అంబేద్కర్‌నగర్ వైపు వస్తుండటంతో వాతావరణ కాలుష్యం కారణంగా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది అనారోగ్యం పాలయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే బుర్రా తుకారం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నెలరోజుల క్రితం ఆరోగ్యం క్షీణించిన అతడు మాట్లాడిన వీడియో శుక్రవారం వైరల్‌గా మారింది. తరచూ ఆసుపత్రులకు వెళ్తూ చికిత్స చేయించుకుంటున్నా ఆరోగ్యం మెరుగుపడే అవకాశం లేకుండా పోయిందని, తమ ఇళ్ల సమీపంలోని సైల్‌బంకర్ కారణంగా ఇప్పటికే మా పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే గ్రామం నుంచి బంకర్ తీసివేయాలని వీడియో ద్వారా తుకారం వేడుకున్నాడు.

ఖమ్మంలో చికిత్స పొందుతూ..

నెల క్రితం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో తుకారం పరీక్షలు చేయించుకోగా కిడ్నీ, లివర్, గుండె, ఊపిరితిత్తుల సమస్య ఉందని, చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లాలని వైద్యులు సూచించారు. హైదరాబాద్ నుంచి 15రోజుల తర్వాత ఇంటికి తిరిగివచ్చిన తుకారాం మందులు వాడుతున్నాడు. గురువారం రాత్రి పరిస్థితి విషమించడంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. అతడికి దివ్యాంగురాలైన భార్య రజినితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

జీవో 317 బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్న భార్యభర్తలను ఒకే జిల్లాకు తీసుకురానున్నారు. 2022లో స్పౌజ్ బదిలీలు జిల్లాలో నిషేధించారు. ప్రస్తుతం ఆ స్పౌజ్ బదిలీలు జరగనున్నాయి. మ్యూచువల్ బదిలీల్లో ఒకే శాఖ, ఒకే క్యాడర్ ఉండాలి. స్కూల్ అసిస్టెంట్ సైన్స్ టీచర్ ఇతర జిల్లాలో అదే క్యాడర్, సబ్జెక్ట్ మీడియం ఒకటే అయి ఉంటే పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రత్యేక వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు చేసుకున్న టీచర్లను ఆయా శాఖల అధిపతులు ఆమోదించి పరిష్కరించనున్నారు.

ఈ విభాగంలో బదిలీ అయినవారు పాత సీనియారిటీ వదులుకోవాల్సి ఉంటుంది. ఈ కేటగిరీలో బదిలీ కావాలంటే జీవో-317 ద్వారా తప్పనిసరిగా ఒక్కరు ప్రభావితులై ఉండాలి. ఈ విషయమై డీఈవో వెంకేటశ్వరచారిని వివరణ కోరగా శనివారం రోజున 40మంది ఉపాధ్యాయులకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల ఆధారంగా సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నామన్నారు.

మచ్చా, వెలగపూడి ఆశయ సాధనకు కృషి

- సీపీఎం జిల్లా నాయకుడు గుడవర్తి

నేలకొండపల్లి, జనవరి17(ఆంధ్రజ్యోతి): తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట యోధులు మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తిల ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన తెలంగాణా పోరాట యోధుల సంస్మరణ సభ శుక్రవారం నేలకొండపల్లి రావెళ్లభవన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ నాటి నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం పేద ప్రజల దోపిడీ నుంచి విముక్తి కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి, మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తిలు నేటి తరానికి ఆదర్శంగా నిలిచారన్నారు. నైజాం సైన్యాలకు వ్యతిరేకంగా గెరిల్లా దళాలను తయారు చేసి పోరు సాగిస్తున్న క్రమంలో ద్రోహుల సమాచారం మేరకు ఆరెగూడెం-గోకినేపల్లి సరిహద్దుల్లో నైజాం సైన్యాలు వీరయ్య, కృష్ణమూర్తిలను కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరయ్య, కృష్ణమూర్తిల ఆశయ సాధనకు కృషి చేయటమే వారికిచ్చే నివాళన్నారు. తొలుత వీరయ్య, కృష్ణమూర్తిల చిత్రపటాలకు పూలమాలలేసి ఘన నివాళులర్పించారు.




అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కుంచె గీసిన చిత్రం..


రాపర్తినగర్ ఫ్లైఓవర్‌పై ఆకట్టుకుంటున్న వాల్ పెయింటింగ్

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం మరింత అందంగా ఉండేందుకు నగర పాలక సంస్థ అధికారులు మెరుగులు దిద్దుతున్నారు. నాలుగు రోజుల్లోనే బస్ డిపో వాల్, మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం రహదారి, ప్రభుత్వం డిగ్రీ కాలేజీ వాల్, రాపర్తినగర్ ఫ్లైఓవర్ వాల్ చిత్రాలు తుది దశకు చేరాయి. మరో 15 రోజుల వ్యవధిలో ఖమ్మం నగరంలోని 60 డివిజన్లలో ప్రధానమైన రహదారి పక్కన ఉన్న గోడలకు అందమైన వాల్ పేయింట్స్ చిత్రీకరించనున్నారు. సుమారు రూ.40 లక్షల వరకు వాల్ యియింటింగ్స్‌కు ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి ఖర్చు చేసే అవకాశం ఉంది. నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య గోడలకు వేయించే చిత్రాలను స్థానిక కళాకారులతో వేయించాలని కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధికాకు సూచించారు. దీంతో స్థానిక కళాకారులకే అవకాశం కల్పించారు.


బస్ డిపో రోడ్డులో వృక్షాలు, జంతువుల చిత్రం

క్రైం సమాచారం

తాగునీరు అనుకొని
గడ్డి మందు తాగిన వృద్ధురాలు

కరకగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దాహం వేయడంతో తాగునీరు అనుకొని గడ్డి నివారణ మందును కొమరం లక్ష్మి అనే వృద్ధురాలు తాగిన సంఘటన కరకగూడెం మండలం పద్మాపురం పంచాయతీ మొగిలితోగు గ్రామంలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 70 సంవత్సరాల వృద్ధురాలు లక్ష్మికి కుటుంబ సభ్యులు బాటిల్‌లో తాగునీరు పెట్టగా.. అక్కడే తిరుగుతున్న వృద్ధురాలు లక్ష్మి కుటుంబ సభ్యులు ఇంటి వద్ద చెట్లకు కొట్టేందుకు తెచ్చిన కంచె వద్ద పెట్టిన గడ్డి మందు పొరపాటున తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు కరకగూడెం ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మణుగూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బొజ్జాయిగూడెంలో దొంగల బీభత్సం

» పంచాయతీ, హెల్త్ సబ్‌సెంటర్, పాఠశాలల్లో చోరీ

ఇల్లెందురూరల్, జనవరి17(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకేరోజు రాత్రి మూడు ప్రభుత్వ కార్యాలయాల్లో చొరబడ్డారు. బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం, హెల్త్‌సబ్‌సెంటర్, ప్రభుత్వ పాఠశాల తాళాలు పగలగొట్టి గ్యాస్ సిలిండర్, స్టవ్, లైట్లు, స్టైషనరీ, విద్యుత్ మోటర్‌లు, వైర్లు దొంగిలించారు. బీరువాలను పగలగొట్టి విలువైన స్టేషనరీ కాగితాలు, ఇతర సామగ్రిని సైతం ఎత్తుకెళ్లారు. గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల, హెల్త్‌సబ్‌సెంటర్‌లో ఒకేసారి దొంగలు పడటంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. చోరీపై గ్రామపంచాయతీ కార్యదర్శి మహబూబ్ పాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో చిన్నారి మృతి

» అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు

పాల్వంచ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చిన్నారి(17నెలలు) మృతి చెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా జిల్లా బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన మంద సతీష్‌కు పాల్వంచ నవభారత్‌కు చెందిన గండూరి రమ్యశ్రీతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. భార్య భర్తల మధ్య విభేదాలతో ఈ నెల 9న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రమ్యశ్రీ తన ఇద్దరు చిన్నారులను అక్కడే వదిలిపెట్టి పాల్వంచలోని తన పుట్టింటికి వచ్చింది. అనంతరం రమ్యశ్రీ తల్లి పద్మ సతీష్ వాళ్ల ఇంటికి వెళ్లి తన మనవరాళ్లను తనతో పాటు తీసుకుని పాల్వంచ వచ్చింది. గురువారం మధ్యాహ్నం పద్మ సతీష్‌కు ఫోన్ చేసి పిల్లలతో మాట్లాడించింది. రెండు గంటల అనంతరం చిన్న పాప మేదశ్రీ(17 నెలలు) కి వాంతులు అవుతున్నాయని, ఆసుపత్రికి తీసుకెళుతున్నామని చెప్పింది. దీంతో పాల్వంచకు చేరుకున్న సతీష్ ఆసుపత్రికి చేరుకుని విచారించగా అప్పటికే వైద్యులు పరీక్షించారని, చిన్నారి మృతి చెందిందని తెలిసింది. దీంతో చిన్నారి మృతిపై తనకు పలు అనుమానాలు ఉన్నాయని తండ్రి సతీష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

ఇనుప షట్టర్ అపహరణ

చింతకాని, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆర్అండ్‌బీ నూతన వంతెనకు సంబంధించిన ఇనుప షట్టర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీనికి సబంధించి పని పర్యవేక్షకుడు కూరాకుల రాంబాబు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రూ.80 వేల నష్టం వాటిల్లినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసం... కేసు నమోదు

చింతకాని, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కూరాకుల ఉదయ్ రూ.50 వేల సైబర్ మోసానికి గురయ్యారు. ఇటీవల ఆయన సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ నుంచి ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా నగదు బదిలీ అయినట్లు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యం

చింతకాని, జనవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు బాలిక తల్లి శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

క్రికెట్ ఆడుతూ కుప్పకూలిన యువకుడు



కూసుమంచి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో తవసి విజయ్(21)అనే యువకుడు హఠాత్తుగా మృతిచెందాడు. ఈఘటన కూసుమంచిలో చోటుచేసుకుంది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన శేఖర్ కుటుంబం సుమారు 20సంవత్సరాలక్రితం కూసుమంచి వచ్చి చిన్న వ్యాపారం చేసుకుంటూ స్థిరపడ్డాడు. కాగా ఇతనికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న వాడైన విజయ్ ఐటీఐలో డిప్లొమా పూర్తిచేసి సూర్యాపేటలో తన సోదరి వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం కూసుమంచి హైస్కూల్ గ్రౌండ్‌లో ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్‌లో స్నేహితులతో కలిసి ఆడుతున్నాడు. మ్యాచ్ ఆడుతుండగా ఛాతిలో ఒక్కసారిగా నొప్పిరావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. చేతులు, నోరు ఒంకర్లు పోవడంతో వెంటనే స్నేహితులు వచ్చి సీపీఆర్ చేశారు. ఆవెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించి ఉన్నత వైద్యం నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారని చెప్పారు. తహసీల్దార్ కరుణశ్రీ మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

నిరసనలో పాల్గొన్న 12మందిపై కేసు

మధిర రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు రింగ్‌సెంటర్లో అబ్బూరి సర్కిల్ బోర్డు తొలగింపునకు నిరసనగా గురువారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపిన మాజీ సర్పంచ్ అబ్బూరి సంధ్యారాణితో పాటు పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై కేసులు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ ఎన్.సంధ్య తెలిపారు. అనుమతి లేకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి నిరసన తెలిపిన కారణంగా బీజేపీ నేత కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఏలూరి నాగేశ్వరరావు, చిలివేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, మర్సకట్ల స్వర్ణాకర్, మీనుగు శంకర్, బీఆర్ఎస్ నేతలు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, అబ్బూరి రామన్, అబ్బూరి సంధ్యారాణిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయులు సమయాన్ని పాటించాలి

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్


సమీక్ష నిర్వహిస్తున్న పీవో

భద్రాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయాన్ని పాటించాలని, రాబోయేది పరీక్షల సీజన్ కాబట్టి ప్రణాళికబద్ధంగా పని చేసి పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో పరీక్షలు పాసయ్యేలా ఉపాధ్యాయులు పనిచేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రత్యేక అధికారులు, ఏటీడీవోల సమావేశంలో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు సరఫరా చేసిన మెటీరియల్ విద్యార్థులు అనుసరిస్తున్నది లేనిది చూడాలని, సంక్రాంతి సెలవులకు వెళ్లి తిరిగి పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను ఎవరిని ఇండ్లకు పంపకూడదని పీవో ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేస్తూ పిల్లల సబ్జెక్టులకు సంబంధించిన అంశాలను పరిశీలించాలని, సాయంత్రం విజిట్ చేసినప్పుడు రాత్రి స్టడీ హవర్స్, డిన్నర్‌ను తనిఖీ చేయాలన్నారు. కొత్త మెనూ ప్రకారం ఆహారం అందుతున్నది లేనిది చూడాలని అన్నారు. పాఠశాలలకు ఏమైనా మైనరు రిపేర్లు ఉంటే వెంటనే వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించి హెచ్ఎంలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఖమ్మం డీటీడీవో విజయలక్ష్మి, ఈఈ చంద్రశేఖర్, ప్రత్యేక అధికార్లు, ఏసీఎంవో రమణయ్య, రాములు, ఏటీడీవోలు జహీరుద్దీన్, చంద్రమోహన్, అశోక్‌కుమార్, రాధమ్మ పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే సహించం

» ఇరిగేషన్‌శాఖ సమీక్షలో చైర్మన్ మువ్వా విజయ్‌బాబు


మాట్లాడుతున్న విజయ్‌బాబు

ఇల్లెందు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించినా, రైతులను పట్టించుకోకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్‌శాఖ రాష్ట్ర చైర్మన్ మువ్వా విజయ్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఇల్లెందు నియోజకవర్గ స్థాయి ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లెందు నియోజకవర్గంలో ఉన్న చెరువులు, కుంటలు, లిఫ్టు ఇరిగేషన్‌ల పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికోసం నీటిపారుదలశాఖ కీలక పాత్ర పోషించాలని కోరారు. నీటిపారుదల రంగంలో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని, రైతులు, ప్రజాప్రతినిధులు తీసుకొచ్చే సమస్యలను పరిష్కారం చేయాలని, ఏ మాత్రం రైతుల పట్ల నిర్లక్ష్యం వహించినా సహించబోమన్నారు. రోళ్లపాడు ప్రాజెక్టు విషయంలో గతంలో పని చేసిన ప్రజాప్రతినిధులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారి హయంలో ఏ పని చేయకుండా ఇప్పుడు విమర్శలు చేయడం సరికాదన్నారు.

నీటిపారుదల సమీక్ష సమావేశానికి హాజరుకాని కామేపల్లి ఇరిగేషన్ డీఈ శంకర్ పై చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈ సక్రమంగా విధులకు హాజరుకావాలని లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కామేపల్లి మండల కేంద్రంలో కాకుండా పండితాపురంలో నిర్వహిస్తున్న ఇరిగేషన్‌శాఖ కార్యాలయాన్ని మండలకేంద్రంలోకి తరలించాలని ఆదేశాలు ఇచ్చారు.

సోలార్ విద్యుత్ ఆలోచన అభినందనీయం

» ఐటీడీఏ పీవో రాహుల్


రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పీవో రాహుల్

కొత్తగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేని పంట భూముల్లో బోర్‌వెల్ వేసుకుని సోలార్ పవర్ ద్వారా సంవత్సరానికి రెండు పంటలు పండించడం అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం బొజ్జలగూడెం, లక్ష్మీపురం, బంగారుచెలక గ్రామాల్లోని రైతులు విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల సోలార్ ద్వారా బోర్‌వెల్ పంపుసెట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించుకుని పండిస్తున్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సౌకర్యం లేక రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి పంటలు పండించుకుంటున్నారని, చాలా గ్రామాల్లో గిరిజనుల పంట పొలాలు నీటి సౌకర్యం లేక బీడు భూములుగా మారిపోతున్నాయని అన్నారు. ఈ గ్రామంలోని రైతులు సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించుకుని పంటలు పండించుకోవడం సంతోషకరమని రైతులను అభినందిస్తూ, ఈ ఆలోచన ఎవరి ద్వార వచ్చిందని రైతులను అడిగి తెలుసుకున్నారు. 2017- 18 సంవత్సరంలో రెడ్‌కో సంస్థ సలహాలతో సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించుకున్నామని తెలిపారు. సోలార్‌తోపాటు తమ భూములకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తే తప్పని సరిగా పంటలు విరివిగా పండించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, మైనింగ్ ఏడీఈ రమేష్, రెడ్కో జీఎం అజయ్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎఈ రఘురామయ్య, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, ఏపీవో పవర్ ఎఈ మునీర్‌పాషా, ఫారెస్ట్ జాయింట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం సెంట్రల్ పార్కు అభివృద్ధికి
రూ.83లక్షల మంజూరు

హరితనిధి కింద నిధులు మంజూరు చేయించిన మంత్రి తుమ్మల

కొత్తగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లి ప్రాంతంలో కొత్తగూడెం, పాల్వంచ జాతీయ రహదారి పక్కనే ఉన్నటువంటి సెంట్రల్‌పార్క్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.83లక్షలను మంజూరు చేసింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొత్తగూడెం సెంట్రల్‌పార్క్‌ను మరింతగా అభివృద్ధి పర్చేలనే సదుద్దేశంతో సెంట్రల్‌పార్క్ అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తిచేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం హరితనిధి కింద కొత్తగూడెం సెంట్రల్ పార్కును మరింత అభివృద్ధిపర్చేందుకు రూ.83లక్షలను మంజూరు చేసినట్లు మంత్రి తుమ్మల వివరించారు. ఈ మేరకు ఫారెస్ట్ డివిజన్ జిల్లా అధికారులు పీసీసీఎఫ్‌ఎకు ప్రతిపాదనలు చేశారు. ఈ నెల 8వ తేదీన అటవీశాఖ మంత్రి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల పాల్గొని పట్టణ అభివృద్ధికి సంబంధించిన కొత్తగూడెం డివిజన్ సెంట్రల్ పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో ఆశాఖకు సంబంధించిన మంత్రి ఆదేశాల మేరకు హరిత నిధి స్కీం నుంచి కొత్తగూడెం సెంట్రల్ పార్కు అభివృద్ధికి రూ.83లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు చీఫ్ కన్జర్వుఆఫ్ ఫారెస్ట్ అధికారి నుంచి నిధులు మంజూరైనట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. సెంట్రల్ పార్కులో 20 సైకిళ్ల కొనుగోలుచేసేందుకు రూ.2లక్షలు, సెంట్రల్ పార్కులో ప్రజలు ఉదయం, సాయంత్రం సమయంలో మార్నింగ్ వాకింగ్‌చేసేందుకు ట్రాక్‌కు రూ.14లక్షలు, ఇంటర్ క్రియేషన్ సెంటర్‌కు రూ. 30లక్షలు, సైన్‌బోర్డుకు రూ.2లక్షలు, పార్కు చుట్టు ఫెన్సింగ్ నిర్మాణానికి సంబంధించిన వైర్లు తదితర వారికి రూ. 35లక్షల నిధులు మంజూరయ్యాయి.

భద్రాచలం రివర్ సైడ్ క్యాంపునకు ప్యాకేజీ ఖరారు

ఒక రోజుకు పూర్తి ప్యాకేజీ రూ.750

విడిదికి రూ.500 మాత్రమే

భద్రాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన రివర్‌సైడ్ క్యాంపులో బస చేసేందుకు ప్యాకేజీని జిల్లా అధికారులు ఖరారు చేశారు. క్యాంపులో ఒక రోజు విడిది చేసేందుకు రూ.500, లంచ్, డిన్నర్, బ్రేక్‌ఫాస్ట్, టీతో కలిపి అయితే రూ.750కి ధర ఖరారు చేశారు. పర్యాటకుల ఆసక్తిని బట్టి ప్యాకేజీ పొడిగింపు కూడా ఉంటుందని తెలిపారు. రూ.750 పూర్తి ప్యాకేజీలో రూ.500 ఒక రోజు విడిది చేసినందుకు, బ్రేక్‌ఫాస్ట్ రూ.60, రూ.20టీ ఉదయం, రూ.20 టీ సాయంత్రం, రూ.150 డిన్నర్ ఉంటాయి.

అలాగే ప్రత్యేక ఆర్డర్లపై భోజన సదుపాయంను సైతం ముందస్తు సమాచారం ఇస్తే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

పూర్తి వివరాలు ప్యాకేజీ కోసం 7995806182లో సంప్రదించాలని కోరారు. కాగా నిర్వహణ బాధ్యతను మహిళ సంఘానికి అందజేయనున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ

» డెంటల్ క్లినిక్ సీజ్ » రెండు వైద్యశాలలకు నోటీసులు


దంత వైద్యశాలను సీజ్ చేసిన దృశ్యం

భద్రాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శ్రీ సాయి సూపర్‌స్పెషాలిటీ దంత వైద్యశాలను సీజ్ చేయడంతో పాటు రెండు ప్రైవేటు వైద్యశాలలకు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, డీఐవో డాక్టర్ బాలాజీలు తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో శ్రీ సాయి సూపర్ స్పెషాల్టీ దంతవైద్యశాల నిర్వహణలో లోపాలుండటంతో దీనిని సీజ్ చేశారు. ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ లేకపోవడం బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంటు లేకపోవడం, ఫీజు వివరాలు, అగ్ని నిరోధక పరికరాలు లేకపోవడంతో పాటు శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది లేకపోవడంతో దంతవైద్యశాలను సీజ్ చేసినట్లు డీఎం హెచ్‌వో డాక్టర్ భాస్కర్ తెలిపారు. పట్టణంలోని శారద నర్సింగ్ హోమ్, శ్రీ కేర్ డెంటల్ వైద్యశాలల్లో రికార్డులను, వైద్య సదుపాయాలను తనిఖీ చేయగా బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సరిగా లేదని, వైద్య పరీక్షలు, ఇతర ఫీజులకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదని గుర్తించి వివరణ ఇవ్వాలని నోటీసులను జారీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో భాస్కర్ మాట్లాడుతూ ప్రతి క్లినిక్, ఆసుపత్రి, డయోగ్నస్టిక్ సెంటర్, ఆయుష్ క్లినిక్‌లు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు చట్టం కింద రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అప్పుల భారంతో రైతు బలవన్మరణం

కూసుమంచి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అప్పుల భారంతో మండలంలోని లోక్యాతండాకు చెందిన వడిత్య నవీన్(33) అనేరైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. తన వ్యవసాయక్షేత్రంలోనే పురుగులమందు సేవించి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం నవీన్ కొంతకాలంగా సుమారు మూడెకరాలు భూమిని కౌలుకు తీసుకుని అందులో కొంత భాగంలో మామిడి అంటుమొక్కలు పెంచుతూ వ్యాపారం చేస్తున్నాడు. మరికొంత భాగంలో మిర్చి ఇతర కూరగాయలు పెంచుతున్నాడు. ఈక్రమంలో అంటుమొక్కల వ్యాపారం, వ్యవసాయం కోసం ఇంట్లో చెప్పకుండా కొన్ని అప్పులు చేశాడు. దీంతో రుణదాతలు తమ అప్పులు తీర్చమని ఒత్తిడి తెస్తున్నారు. పదిరోజుల క్రితం మొక్కల పనిమీద వెళుతున్నానని అని చెప్పి పదిరోజులుగా ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు ఫోన్‌లు చేసిన ఎత్తలేదు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో కౌలు చేస్తున్న పొలంలో శవమై కనిపించాడు. ఈవిషయాన్ని పరిసర రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. పక్కనే క్రిమి సంహారక మందు ఉందని తెలిపారు. మృతుడికి భార్య స్వాతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం, జనవరి17(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. దానవాయిగుడేనికి చెందిన బోడా రమణ(50) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల లారీని కొనుగోలుచేసి ఈఎంఐలు కట్టలేక ఇబ్బంది పడుతున్నాడు. ఫైనాన్స్ కంపెనీ వారు లారీను తీసుకు వెళతారేమో అని మనస్తాపంతో శుక్రవారం తెల్లవారుజామున తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లారిన తరువాత గమనించిన భార్య పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

కరకగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతే గ్రామ సమీపంలోని టవర్ వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మోతే గ్రామానికి చెందిన మెంతెని పున్నమయ్య అనే వృద్ధుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎడమ చేయి విరిగింది. గ్రామస్థులు గమనించి 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మణుగూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఫంక్షన్ హాలులో అగ్ని ప్రమాదం

పినపాక, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పినపాక మండలం బయ్యారం క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న జీవీఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ కావడంతో హాలు మంటలు వ్యాపించి దగ్ధమైంది. వెంటనే అగ్నిమాపక యంత్రంతో సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూ.35 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం. సమాచారం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం ఫంక్షన్ హాలుకు వెళ్లి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోడిశాల రామనాథం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఉడుముల లక్ష్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తోలెం అర్జున్, సతీష్‌రెడ్డి, కాంతయ్య, కార్యకర్తలు ఉన్నారు.

కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తాం

» కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్

కొత్తగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం కోసం సీఎంపీఎఫ్ ద్వారా మెరుగైన సేవలను అందిస్తున్నట్లు కేంద్ర బొగ్గుమంత్రిత్వశాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్ తెలిపారు. పెన్షన్ నిధిని అత్యంత పారదర్శకంగా సమర్థవంతంగా వినియోగించేలా కృషి చేస్తున్నామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో సీఎంపీఎఫ్ 183వ బోర్డు ఆఫ్ ట్రస్ట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్‌దారుల సంక్షేమానికి పెన్షన్ నిధిని సుస్థిరంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో కేంద్రమంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ బ్రార్, ఫైనాన్స్ సలహాదారులు నిరుపమా కోట్రు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్, సీఎంపీఎఫ్ కమిషనర్ విజయ్‌కుమార్ మిశ్రా, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రమాదేవి

లక్ష్మీదేవిపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా వంగెల రమాదేవిని నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల హనుమంతరావు తెలిపారు. శుక్రవారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రమాదేవి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆదర్శాలకు పునరంకితమై నీతి, నిజాయతీ, నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని ప్రకటించారు. జిల్లాలో బీసీల సంక్షేమానికి కృషిచేయనున్నట్లు తెలిపారు. బీసీ కులాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాళ్లు దేవి ప్రసన్న, బాలిశెట్టి సత్యభామ, మునీల తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అశ్వాపురం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన కానరాజు శాంతమ్మ చిత్రపటానికి డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య నివాళులర్పించారు. శుక్రవారం శాంతమ్మ ప్రథమవర్ధంతి కార్యక్రమం మొండికుంటలో నిర్వహించగా ఆయన హాజరై కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో శాంతమ్మ కుటుంబసభ్యులు, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అనాథ శరణాలయాల తనిఖీ

కొత్తగూడెం లీగల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి కొత్తగూడెంలోని శ్రీ స్నేహిత సంఘం వృద్ధుల శ్రమం, శ్రీ జ్యోతి అనాథ వృద్ధాశ్రమం, శ్రీ సత్యసాయి అనాథ వృద్ధాశ్రమాలను శుక్రవారం సందర్శించి వారికి కల్పిస్తున్న కనీస సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తి ఆశ్రమ నిర్వాహకులకు తగు సూచనలు ఇస్తూ సౌకర్యాలు మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. ఆశ్రమాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, న్యాయ సంబంధమైన సమస్యలు ఏమైనా ఉంటే డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి దరఖాస్తు ఇవ్వడం ద్వారా ఉచితంగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నిరంజన్‌రావు, సీనియర్ న్యాయవాది రాజమల్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

దుమ్ముగూడెం జనవరి 17 (ఆంధ్రజ్యోతి) డి కొత్తగూడెం అగ్నిప్రమాద బాధిత కారం చెంచయ్య కుటుంబానికి శుక్రవారం భద్రాచలం రెడ్‌క్రాస్ సొసైటీ క్లబ్ వితరణను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అందజేశారు. ఇంటి సామగ్రితోపాటు కొంత నగదును బాధితులకు పంపిణీ చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలి సర్వం కోల్పోయిన చెంచయ్య కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. నాయకులు వెంకటరెడ్డి, రమేష్, తిరుపతిరావు తదితరులున్నారు.

అర్హుల గుర్తింపు సర్వే ముమ్మరం

- నిజమైన లబ్ధిదారులను గుర్తించండి
- జిల్లాలో సంక్షేమ సర్వేలను పర్యవేక్షిస్తున్న అధికారులు
- రెండో రోజు కొనసాగిన సర్వే


పాల్వంచ మండలం కోడిపుంజులవాగు గ్రామంలో సర్వేను పరిశీలించిన జడ్పీ సీఈవో నాగలక్ష్మి

కొత్తగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అర్హులకే పథకాలు అందాలని, నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని జిల్లాలో సంక్షేమ సర్వేలో భాగంగా జిల్లా అధికారులు పర్యవేక్షించి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అర్హులకే అందజేయాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలపై ముందస్తు ప్రాతిపదికన ఐదు రోజులపాటు సర్వేని క్షేత్రస్థాయిలో నిర్వహించాలని ఆదేశించింది. ఇప్పటికే జిల్లాలో వివిధ రెవెన్యూ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. రెండు రోజులు పూర్తైంది. మరో మూడు రోజుల్లో సర్వేలు నిర్వహించి 22వ అయా రెవెన్యూ గ్రామ పరిధిలో గ్రామసభలు నిర్వహించి సంబంధిత గ్రామాల్లో ఉన్న ప్రజలతో ఈ పథకాలపై అధికార యంత్రాంగం సమీక్షించనున్నది. జిల్లాలో ఐదు నియోజకవర్గాలైన కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందు, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లోని పలు రెవెన్యూ గ్రామాలతోపాటు పట్టణాల్లో సైతం సర్వే నిర్వహిస్తున్నారు. పట్టణాల్లో గ్రామస్థాయి నుంచి సర్వేలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి వ్యవసాయశాఖ, రెవిన్యూశాఖాధికారులు ఎప్పటికప్పుడు సర్వే కోసం నిర్వహించి అధికారుల పర్యవేక్షణలో అయా గ్రామాల్లో సర్వేలను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 26 నుంచి ఈ నాలుగు పథకాలు ప్రారంభకానున్నాయి. రైతుభరోసా పథకం కింద సాగు జరగని భూములపై క్షేత్రస్థాయి సర్వే బృందం ఆరా తీస్తోంది. ఆదేవిధంగా పంటలు పండించని భూములను ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా జాగ్రత్తగా తీసుకుని వాటన్నింటిని పక్కన పెట్టేందుకు సర్వేలో అధికారులు సిద్ధమయ్యారు. అయా రెవెన్యూ గ్రామ పరిధిలో ఏ మేరకు పంటలు పండించే భూములు ఉన్నాయి.. పంటలు వేయని భూములు ఎన్ని ఉన్నాయి.. గుట్టలు ఉన్నటువంటి భూములు ఎన్ని ఉన్నాయి.. నాన్ అగ్రికల్చర్ కింద కన్వర్ట్ అయిన భూములు ఎన్ని ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వెంచర్ల కింద ఉన్న భూములు, రోడ్ల కింద పోయిన భూములు, ఇళ్ల స్థలాల కింద వెళ్లిన భూములను గుర్తిస్తున్నారు. ఆ భూములను గ్రామసభలో అయా యజమానులకు తెలియచేసి ఆ భూమి కింద గతంలో వచ్చిన రైతుబంధు పథకం ద్వారా ప్రస్తుతం తీసుకునే రైతు భరోసా పథకంను తొలగించేందుకు వెనుకడటం లేదు. ఆదేవిధంగా ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకం కింద నిరుపేదలను గుర్తించి వారికి ఇంటి స్థలం ఉంటే ఇళ్ల నిర్మాణం చేసేందుకు రూ.5లక్షలు ప్రభుత్వం అందజేసేందుకు సిద్ధమైంది. ఆదేవిధంగా కొత్తరేషన్‌కార్డులు పంపిణీ చేసేందుకు కూడ అర్హులు సిద్ధంగా ఉన్నారు. ఇందిరమ్మ ఆత్మీ భరోసా కింద రూ.12వేల నగదును భూమి లేని నిరుపేద కూలీలకు మాత్రమే సిద్ధమయ్యారు. వీటన్నింటిపై సమగ్రంగా సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం చేపట్టిన సంక్షేమ పథకాల సర్వేను అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ జిల్లాలో బూర్గంపాడు మండలం సోంపల్లి, లక్ష్మీపురం, కొయగూడెం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని సర్వే అధికారులకు సూచించారు.

అధికారులంతా గ్రామాల్లోనే..

అశ్వాపురం(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈనెల 26నుంచి అమలు చేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నారు. సర్వేలో తహసీల్దార్, అధికారులు పాల్గొంటున్నారు.

సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

టేకులపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సూపర్ చెక్ సర్వే ప్రక్రియను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన పరిశీలించారు. టేకులపల్లిలో ఉపాధి హామీ కార్యాలయం, కోయగూడెంలో గిరిజన రైతు వేదికను వేర్వేరుగా సందర్శించారు. ముసగతోట, సులానగర్, ముత్యాలంపాడుక్రాస్‌రోడ్డు గ్రామాలలో నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశారు.

మణుగూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామానుజవరం, విజయనగరం గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ లబ్ధి దారుల ఎంపిక సర్వే శుక్రవారం తహసీల్దార్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో ఆర్‌డీవో పరిశీలన

అశ్వారావుపేట రూరల్ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం చేపట్టే సర్వే పూర్తి పారదర్శకంగా ఉండాలని కొత్తగూడెం ఆర్డీవో మధు సూచించారు. మండలంలోని నారంవారిగూడెం గ్రామపంచాయతీలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణప్రసాద్, ఎంపీవో వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌ఐ కృష్ణ, పద్మావతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బూర్గంపాడులో అదనపు కలెక్టర్

బూర్గంపాడు జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న సంక్షేమపథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వేను శుక్రవారం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి,తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఏవో శంకర్, ఆర్‌ఐ నర్సింహారావులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

జూలూరుపాడు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు లబ్ధిదారుల గుర్తింపు కోసం చేపడుతున్న సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి రుక్మిణీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని పడమటనర్సాపురం గ్రామాన్ని సందర్శించి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యదర్శి హరిత పాల్గొన్నారు.

నాటుపడవపై క్షేత్రస్థాయి పరిశీలన

దుమ్ముగూడెం (ఆంధ్రజ్యోతి): రెండోరోజైన శుక్రవారం నాలుగు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం అర్హుల గుర్తింపు సర్వేలను మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. దుమ్ముగూడెం రెవెన్యూ గ్రామం గోదావరి లంక ప్రదేశంలో సర్వే నెంబరు 3 లో భూమిని తహసీల్దార్ అశోక్‌కుమార్ నాటుపడవపై వెళ్లి పరిశీలించారు. అక్కడ రాళ్లు, గుట్టలతో కూడిన 37 ఎకరాల భూమి వ్యవసాయానికి పనికి రానిదిగా గుర్తించారు. ఏఈఓ బాలాజీ బృంద సభ్యులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అశ్వారావుపేట టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సంతోష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణపురం, వినాయకపురం సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు ఉదయం గం. 9 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్



కొత్తగూడెం టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) కార్యవర్గ సమావేశం శుక్రవారం కొత్తగూడెంలో జరిగింది. అనంత రం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ గజేసింగ్‌లు ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా భూక్య శంకర్, మాలోత్ వీర్య, కపిల్, చంద్రకాంత్ వ్యవహరించారు.

పీఎఫ్ వివరాలు తేల్చండి

మణుగూరుటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన పీఎఫ్ వివరాలు ఇప్పటికైనా తేల్చాలని, పెనాల్టీ విధానాలకు స్వస్తి పలికి, సమయానికి వేతనాలు అందివ్వాలని ఇఫ్టూ నాయకులు శుక్రవారం ఏరియా ఎస్‌వోటు జీఎం శ్యామసుందర్‌కు వినతిపత్రాన్ని అందించారు. నాయకులు మిడిదొడ్డ నాగేశ్వరరావు, నాసర్ పాషా మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా పీఎఫ్ వివరాలు తెలపడంలో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా ఖాతాల వివరాలను బహిర్గతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబు, రవి, మంగిలాల్, రమేష్, గురుమూర్తి, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

మోకాళ్ల చికిత్సకు మెరుగైన వైద్యసేవలు

▸ యశోద ఆస్పత్రి వైద్యుడు సునీల్

కొత్తగూడెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మోకాళ్ల నొప్పులకు మెరుగైన వైద్యసేవలను అందిస్తామని యశోద ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు సునీల్ దాచేపల్లి తెలిపారు. రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జరీ ద్వారా మోకాళ్ల నొప్పులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. శుక్రవారం సూర్యాపేలెస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం ప్రాంతానికి చెందిన వైద్యుడిగా ఎదిగి రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలో కొత్త విధానం వచ్చిందన్నారు. రోబోతో చేసే వైద్యం మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు. రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'మలిదశ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం'

పాల్వంచటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధన కోసం మలిదశ ఉద్యమంలో పోరాటం చేసిన ఉద్యమకారులకు న్యాయం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. శుక్రవారం జైతెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. జైతెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రషీద్ ఆధ్వర్యంలో ఆయనకు బొకే అందజేసి ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఈశగా ఎమ్మెల్యే కూనంనేని ప్రయత్నిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఉప్పుల శ్రీను, ఆర్ వెల్లి పెద్దబాబు, గౌస్, జయరాజు, సర్వాం, తంగేటి రాము, ఆసిఫ్, పాషా, నయాం, పఠాన్ సత్తార్, బోగిని సందీప్, నివాస్, ఇబ్రహీం, ఇమ్రాన్, సోహెల్, అక్రమం, అజ్జత్, అంజాద్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా వైద్యసేవలు: ఎమ్మెల్యే కోరం

ఇల్లెందు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సౌకర్యాన్ని కల్పించేందుకు అర్బన్ హెల్త్ సెంటరును ఏర్పాటుచేస్తున్నట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని 2, 20 వార్డుల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన రూ.1.30కోట్లతో, 2వ వార్డులో అర్బన్‌హెల్త్‌కేర్ ఆసుపత్రిని నిర్మాణంచేయనున్నట్లు వెల్లడించారు. 100 పడకల ఆసుపత్రిని సైతం త్వరలో నిర్మాణ పనులు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, 2వ వార్డు కౌన్సిలర్ కట కం పద్మావతి, కమిషనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి: ఏఎస్పీ

భద్రాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ అన్నారు. భద్రాచలంలో శుక్రవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ ప్రతి వాహన దారుకు హెల్మెట్ ధరించడంతో అన్ని రకాల వాహన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట పుల్లయ్య, సీఐ సంజీవరావు, ఎస్సైలు మధుప్రసాద్, విజయలక్ష్మి ఫైర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం తిరుపతి, సీఐ గౌతమి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

పాల్వంచ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి విగ్రహాల ఏర్పాటుకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. మాల జాతీయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేటీపీఎస్ 7వ దశ సీఈ పాలకుర్తి వెంకటేశ్వర్లు, 5,6 దశ సీఈ ప్రభాకరరావు, ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఓసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, 1535 యూనియన్ నాయకులు, 327 యూనియన్, 1104, టీఆర్‌వీకేఎస్ యూనియన్ల నాయకులతో పాటు మాల మిత్రులు ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కరరావు, స్థానిక నాయకులు నల్లబెల్లి రాంబాబు, సంపత్, వెంకటేశ్వర్లు, వినయ్ రాజ్, 5,6, 7 దశల ఎస్‌ఈలు పాల్గొన్నారు.

రేపు న్యాయవాదుల క్రీడలు

చుంచుపల్లి, జనవరి17(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ సందర్భంగా క్రీడా పోటీలను ఆదివారం రామవరం సాధన గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. పోటీలు విజయవంతం చేయాలని కోరారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

బూర్గంపాడు జనవరి 17(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడ్ జడ్పీహైస్కూల్ నందు శనివారం నవోదయ ఆరోతరగతి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సింహరాజు శుక్రవారం తెలిపారు. పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30నిమిషముల వరకు జరుగుతుందని విద్యార్థులు 10గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

మునిసిపల్ చైర్మన్‌కు సన్మానం

ఇల్లెందు టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును శుక్రవారం మునిసిపాలిటీలోని వాటర్ వర్క్స్ విభాగం కార్మికులు ఘనంగా సత్కరించారు. ఫిల్టర్ బెడ్ వద్ద జరిగిన సన్మాన కార్యక్రమంలో వాటర్ వర్క్స్ కార్మికులు చైర్మన్‌ను సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఐదు సంవత్సరాలపాటు ప్రజాపాలన అందించామని ప్రకటించారు. పాలకవర్గం మునిసిపాలిటీకి ఆదాయ వనరులు వచ్చే విధంగా చర్యలు తీసుకుని దిశా చేర్చిన్నారు. ఈ ఐదు సంవత్సరాల పదవీకాలంలో పట్టణ ప్రజల సహకారం మరువలేనిదన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ అంకెపాక నవీన్‌కుమార్, మున్సిపల్ ఏఈ శంకర్, కార్మికులు నర్సింహారావు, కృష్ణ, కడారి వెంకటేష్, వీరన్న, గురునాథం, రవి, కొండ ప్రకాష్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్యాన్ని గుర్తించకపోవడం అవివేకం

● యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి17(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యాన్ని గుర్తించకపోవడం ఆర్ఎస్ఎస్ అవివేకానికి నిదర్శనంగా నిలుస్తుందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్ ఆరోపించారు. శుక్రవారం కొత్తగూడెంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ దిష్టిబొమ్మను ఊరేగించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం అయోధ్యలో రామ మందిరం ప్రారంభమైన రోజే వచ్చిందన్న భగవత్ వ్యాఖ్యలు దారుణమన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పాల సత్యనారాయణరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీలు గులాం మతీన్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో

ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆజ్మీరా సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ దిష్టిబొమ్మను అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట రూరల్(ఆంధ్రజ్యోతి): దేశస్వాతంత్ర్యంపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జూపల్లి కోదండ రామారావు అన్నారు. అశ్వారావుపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగ కిషోర్, నాయకులు తరుణ్, శ్రీను, ప్రవీణ్, షఫీ, అల్లాడి రామారావు, గోపి, అశోక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు వైద్యుల నియామకం

చుంచుపల్లి, జనవరి17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం)లో ఖాళీగా ఉన్న రెండు బస్తీ దవాఖానాల వైద్యులను భర్తీ చేసి నియామక పత్రాలను ఐడీవోసీలో డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ శుక్రవారం అందజేశారు. జీవిత విధుల్లోని నోటిఫికేషన్ ఆధారంగా ఇంటర్వ్యూలకు హాజరైన వైద్యుల మెరిట్ లిస్ట్‌ను పరిగణలోకి తీసుకుని ఈ ఎంపిక లను చేశారు. వీరిలో డాక్టర్ కట్టా శరత్ చంద్ర (కరకవాగు), డాక్టర్ అజిత్ మునవర్ (విద్యా నగర్) కు కేటాయించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్బిఎస్కే డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా డిప్యూటీ డెమో ఫైజ్ మొహినుద్దీన్, సూపరింటెండెంట్ కె.సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్ రత్నరాజు పాల్గొన్నారు.

అనంతారంలో వైద్యశిబిరం

జూలూరుపాడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామంలో కిడ్నీ వ్యాధి గ్రస్తులకు వైద్య సేవలను అందించేందుకు ఖమ్మం నగరానికి చెందిన జంగాల నాగేశ్వరరావు ఫౌండేషన్ ముందుకు వచ్చింది. సాయిరాం ఆసుపత్రికి చెందిన మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జంగాల సునీల్, చైర్మన్ స్వాతిలు స్పందించారు. శుక్రవారం అనంతారం గ్రామంలో కిడ్నీ వ్యాధి గుర్తింపు కోసం కారణాలను తెలుసుకునేందుకు మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జూలూరుపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్ ప్రారంభించారు. వైద్యులు విజేష్‌వర్మ, కిషోర్ రెడ్డిలు కిడ్నీ, లివర్ వ్యాధి గ్రస్తులకు, ప్రజలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, నాయకులు కర్నా రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


రైల్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు భాషాబాబా డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్)లో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ కార్మికుల సమస్యలపై పిడబ్ల్యూఐ కార్యాలయం వద్ద ఈ నిరసన ధర్నాను చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామారావు, సంపత్, శంకర్, పుల్లయ్య, పవన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య శిబిరాలు

భద్రాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): త్వరలో భద్రాచలం ఏజెన్సీలో క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని రెడ్‌క్రాస్ సంస్థ జనరల్ సెక్రటరీ శ్రీరాములు తెలిపారు. భద్రాచలంలో బాలిసేవ్, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్, ఎన్‌ఆర్ వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటపుల్లయ్య, రెడ్‌క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌ఎల్ కాంతారావు, వైస్‌నారాయణరావు, రాజారెడ్డి, డా.పై. భానుప్రసాద్, అబ్రహాం, చారుగుళ్ల శ్రీనివాస్, జి.సంజీవరావు, కె.ఇబ్రహాం, జి.సుధాకర్‌రావు, డా. ఆర్.నారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే జారె


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ


అశ్వారావుపేట రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పేదబిడ్డకు సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని, వచ్చే నాలుగేళ్లలో అందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా సొంతింటి కల నెరవేరుతుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి రూ.75లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతారం సమీపంలో కల్వర్టు నిర్మాణానికి, కోయ రంగాపురంలో పంచాయతీ భవనానికి శంకుస్థాపనలు చేశారు. వేదాంతపురం, గుర్రాలచెరువు, కేసప్పగూడెం గ్రామాల్లో రూ.60లక్షలతో నిర్మించిన మూడు గ్రామపంచాయతీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఆహార భద్రతా కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, తుమ్మారాంబాబు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి ప్రదీప్‌తో పాటు పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత చెడుకు దూరంగా ఉండాలి

గ్రామీణ ప్రాంత యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. మండలంలోని కొత్తకన్నాయిగూడెం గిరిజన గ్రామంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం ప్రారంభించారు.

భూ నిర్వాసితులకు పరిహారం అందించాలి

▸ కలెక్టర్ జితేష్ వీ పాటిల్‌కు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జూలూరుపాడు మండలంలో సీతారామ కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు త్వరితగతిన పరిహారాన్ని అందించాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ను కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే కలెక్టర్‌ను కార్యాలయంలో కలిసి మండల అభివృద్ధి నిధులను కేటాయించాలని, భూనిర్వాసితులకు పరిహారం ఇప్పించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. మండలం అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలోని బోజ్యాతండా గ్రామానికి చెందిన 18 మంది రైతులకు చెందిన పోడు భూమిని కెనాల్ నిర్మాణంలో కోల్పోయారని వారికి పరిహారాన్ని అందించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, నాయకులు రామకృష్ణ, చింతలపూడి రాజశేఖర్, గుగులోత్ కృష్ణ, ఏనుగుల అర్జున్‌రావు, అరుణ్, బాలు, రైతులు పాల్గొన్నారు.